16 నుంచి మళ్లీ ఉగ్ర 'ఈశాన్యం'

● వరుస అల్పపీడనాల ప్రభావం

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరుస అల్పపీడనాలతో, రాష్ట్రంలో ఈ నెల 16వ తేది నుంచి 'ఈశాన్య' రుతుపవనాలు తీవ్రరూపం దాల్చనున్నట్టున్న వాతావరణ పరిశోధన కేంద్రం అంచనా వేసింది. రాష్ట్రంలో అక్టోబరు నుంచి ఒకేసారి తీవ్రమైన ఎండ, తీవ్రమైన వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నైరుతి పవనాలు బలహీనపడుతున్న సమయంలో, ఈశాన్య రుతుపవనాల రాకతో వరుస అల్పపీడనాలు ఏర్పడుతున్నాయి. ఇటీవల 'మొంథా' ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి, జలాశయాల్లో నీటిమట్టం పెరిగింది. ఈ రుతుపవనాలు తీవ్రరూపం దాల్చుతాయని భావించగా, దానికి విరుద్ధంగా కొద్దిరోజులుగా వర్షాలు లేకుండా పోయాయి. అంతేగాక ఎండ తీవ్రత పెరిగింది. ఈ నెలాఖరు వరకు వర్షాలు ఆశించినంతగా కురిసే అవకాశం లేదని నిపుణులు భావించారు. ఈ నేపథ్యంలో, చెన్నై సహా తీర ప్రాంతాల జిల్లాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ ప్రకారం, శ్రీలంక తీరం వెంబడి నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం వాయుగుండంగా బలపడి, ఈ నెల 16 నుంచి ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చవచ్చని అంచనా వేసింది. ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కారణంగా తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో బుధవారం నుంచి ఈ నెల 15వ తేది వరకు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. ఆ ప్రకారం, ఈ నెల 12న తంజావూరు, పుదుకోట, రామనాథపురం, విరుదునగర్, తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి, నీలగిరి, కోవై, తిరుపత్తూర్, తేని, తెన్‌కాశి జిల్లాలు, 13న కోవై, నీలగిరి, దిండుగల్, తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, జిల్లాల్లోని కొన్ని చోట్ల భారీవర్షం కురిసే అవకాశముంది. 14,15 తేదీల్లో రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా మారి, రాత్రిపూట, తెల్లవారుజామున కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

అర్హులందరికీ 'కలైంజర్' నగదు పథకం

● కొత్తగా నియో టైడల్ పార్కు ● పుదుకోట సభలో సీఎం స్టాలిన్ హామీ

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన గృహిణులందరికీ కలైంజర్ సాధికారిక నగదు పథకాన్ని అమలు చేస్తామని, అదే విధంగా ఐటీ రంగంలో అర్హులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పుదుకోటలో నియో టైడల్ పార్క్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం పుదుకోటలో జరిగిన కార్యక్రమంలో రూ రూ.223 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించి, రూ.201.70 కోట్లతో కొత్తగా చేపట్టనున్న 103 పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. వివిధ సంక్షేమ పథకాల కింద 43 వేల మందికిపైగా లబ్ధిదారులకు రూ.341.77 కోట్ల విలువైన సహాయాల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సభలో ఆ జిల్లా కు ఆరు వరాలను ప్రకటించారు. ఆ మేరకు అరంతాంగి జోన్‌లో వీరకొండాన్ చెరువు, సెంగల్ నీర్ చెరువును రూ.15 కోట్లతో పునర్నించనున్నామని, కీరమంగళం ప్రాంతంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారు పండించే కాయగూరలను నిల్వచేసేందుకు రూ.1.60 కోట్లతో శీతలీకరణ గిడ్డంగి ఏర్పాటు చేస్తామని, వట్టకాడు పట్టణ పంచాయతీలో రూ.10 కోట్లతో ఫ్లైఓవర్లు నిర్మిస్తామని, జిల్లాలోని యువతతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలను పెంచేందుకు పుదుకోటలో నియో టైడల్ పార్కు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. గంధర్వకోట పట్టణ పంచాయతీని నగర పంచాయితీగా, పొన్నమారవతి పట్టణ పంచాయతీని నగర పంచాయతీగా హోదా పెంచనున్నామని తెలిపారు.


పుదుకోటలో కొత్త పథకాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

'సర్'పై నిఘా వేయండి

రాష్ట్రంలో భారీ యెత్తున ఓట్ల చోరీకి పాల్పడేందుకు కేంద్రంలోని బీజేపీ పాలకులు ఎన్నికల సంఘాన్ని రంగంలోకి దిపారని,, ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణల పేరుతో అర్హులైన ఓటర్లందరినీ, ప్రత్యేకించి డీఎంకే, దాని మిత్రపక్షలకు ఓటేసే మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీల ఓట్లను తొలగించేందుకు ప్రణాళిక వేశారని స్టాలిన్ ఆరోపించారు. డీఎంకే శ్రేణులే కాకుండా ఆయా ప్రాంతాల ప్రజలు కూడా సర్‌లో అక్రమాలు జరుగకుండా నిఘా వేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం సక్రమంగా, నిష్పక్షపాతంగా, ప్రజాస్వామబద్ధంగా జరుపుతుందనే నమ్మకం తనకు ఏ మాత్రం లేదని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి డీఎంకేని మళ్లీ గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, రఘుపతి, మెయ్యనాథన్, పెరియకరుప్పన్, అన్బిల్ మహేష్, ఎంపీలు ఎ.రాజా, తిరుచ్చి శివా, దురై వైగో, నవాజ్‌ఖనీ, ఎమ్మెల్యేలు ముత్తురాజా, రామచంద్రన్, చిన్నదురై, మాజీఎంపీ అబ్దుల్లా, మాజీ శాసనసభ్యుడు కవిదైపిత్తన్, జిల్లా కలెక్టర్ అరుణా తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్‌వి పసలేని విమర్శలు...

అన్నివర్గాలవారికీ అన్ని సదుపాయాలు అనే ఏకైక లక్ష్యం దిశగా రాష్ట్రంలోని డీఎంకే ద్రావిడ తరహా పాలనలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తున్నారని, మహిళాభ్యుదయంలో అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని కేంద్ర ప్రభుత్వం వెలువరించిన గణాంకాలే నిదర్శనమని స్టాలిన్ అన్నారు. ప్రతిపక్షం అంటే ప్రభుత్వం అమలు చేసే ప్రతిపథకాన్ని విమర్శడమేనని అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి అదే పనిగా తప్పుడు ఆరోపణలు, విమర్శలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో ప్రజలు మమేకమై ఉన్నారని, డీఎంకే సర్కారు, ప్రజలకు మధ్య నున్న ఈ పటిష్ఠ బంధమే వచ్చే యేడాది ఎన్నికల్లో డీఎంకే ద్రావిడ తరహా పాలన 2.0గా మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు.

టాస్మాక్ దుకాణాల్లో క్యూ ఆర్ కోడ్ అమలు

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ దుకాణాల్లో ఎమ్మార్పీ ధర కంటే అదనంగా వసూలుచేయకుండా క్యూ ఆర్ కోడ్ సదుపాయం తీసుకు రానున్నారు.. తొలివిడతగా నగరంలోని 70 టాస్మాక్ దుకాణాల్లో ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది. టాస్మాక్ దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది, మద్యం బాటిల్ ఎమ్మార్పీ ధర కంటే అధికంగా రూ.10 వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై స్పందించిన టాస్మాక్ సంస్థ, దీనిని అరికట్టాలని నిర్ణయించింది. ఆ మేరకు 'డైనమిక్ క్యూ ఆర్ కోడ్' రూపొందించింది.. ఈ సదుపాయం ముందుగా రాజధాని నగరంలోని 70 మద్యం దుకాణాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. అనంతరం అన్ని జిల్లాల్లోనూ అమలు చేయనున్నట్లు టాస్మాక్ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఎమ్మార్పీ ధరల కంటే అధిక రుసుము తీసుకుంటే 1800 4252 015 అనే టోల్ ఫ్రీ నెంబరుకు, నగరానికి చెందిన వారు 9445029756, 044-28542303 అనే నెంబర్లలో టాస్మాక్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని టాస్మాక్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆరోగ్యవంతమైన సమాజం కోసమే

ధన్వంతరి హోమం

● 'పరమేష్టి'లో త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'సమతా ఇష్టి' మహాయజ్ఞంలో భాగంగా ఆచార్య అనుగ్రహంతో సమాజం ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతోనే 'పరమేష్టి (ధన్వంతరీ హోమం)' నిర్వహించినట్లు త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు. పెరంబూర్‌లోని ఎస్పీఆర్ సిటీలో సమతా ఇష్టి సేవా కమిటీ, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభమైన 'స్వాప్తాహ్నిక పంచకుండాత్మక సమతా ఇష్టి' కార్యక్రమం సోమవారం చినజీయర్ పర్యవేక్షణలో జరిగింది. ఉదయం 8 గంటలకు తీర్థగోష్టి, 10 గంటలకు మంత్ర దీక్ష, మధ్యాహ్నం 12 గంటలకు ఉదయ పూర్ణాహుతి, విష్ణు సహస్ర నామ పారాయణంతో పాటు సర్వవ్యాధి నివారణ కోసం పరమేష్టిని వైభవంగా నిర్వహించారు. ఈ పూజలో వైద్యరంగంలో రాణిస్తున్న పలువురు ప్రముఖులతో పాటు అపోలో ఆస్పత్రుల చైర్మన్ డా.ప్రతాప్ సి.రెడ్డి-సుచరిత దంపతులు హాజరై చినజీయర్ ఆశీస్సులు అందుకున్నారు. అదే విధంగా, ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు వేలుగుడి కృష్ణన్, రంగనాథన్, పలు హిందూ సంస్థల గురువులతో జీయరు స్వామి 'పంచ సంస్కారం' నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు విశాఖకు చెందిన కళాకారులు ప్రదర్శించిన హరికథ అందర్నీ ఆకట్టుకుంది. 6.30 గంటలకు జీయరు స్వామి అనుగ్రహ భాషణం, గోపూజ, రాత్రి 8.30 గంటలకు పూర్ణాహుతి తదితర కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


అపోలో గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న చినజీయర్ స్వామి

దొంగ ఓట్లు కుదరవనే

'సర్'కు వ్యతిరేకం

● డీఎంకేపై ఈపీఎస్ విసుర్లు



మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 21 ఏళ్ల అనంతరం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) వల్ల దొంగ ఓట్లు వేసేందుకు అవకాశం ఉండదన్న భయంతోనే డీఎంకే వ్యతిరేకిస్తోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆరోపించారు. కోయంబత్తూర్ విమానాశ్రయంలో సోమవారం ఉదయం ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం, అర్హత కలిగిన వారు మాత్రమే ఓటరు జాబితాలో ఉండాలన్న దృష్టితో కేంద్ర ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియను రాష్ట్రంలో ప్రారంభించిందన్నారు. గతంలో 8 సార్లు ఓటరు జాబితాను సవరించారని, అయితే ఆ జాబితాల్లో మరణించినవారు, వలస వెళ్లి వారి పేర్లు కూడా ఉండడంతో, వాటిని తొలగించడమే 'సర్' ఉద్దేశమని, ఈ ప్రక్రియను వ్యతిరేకించడం సరికాదన్నారు. డీఎంకే, మిత్రపక్షాలు 'సర్' మాట వింటేనే ఉలిక్కిపడుతున్నాయని, ఈ ప్రక్రియ పారదర్శకంగా, సకాలంలో పూర్తిచేసేందుకు బీఎల్వోలున్నారని తెలిపారు. నగరంలో దొంగఓటు వేసేందుకు యత్నించిన డీఎంకే నిర్వాహకులను మాజీ మంత్రి డి.జయకుమార్ పట్టించారని, ఓటరు జాబితా సవరణల్లో తప్పులుంటే వాటిని సరిచేసుకోవాలే కానీ, వ్యతిరేకించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

రాష్ట్రంలో అలర్ట్

రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో తనిఖీలు

సమస్యాత్మక ప్రాంతాల్లో డేగకన్ను

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం సంభవించిన పేలుడు ఘటనతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. దేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా పేళుళ్లకు అవకాశం ఉందన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో రాష్ట్ర పోలీసు శాఖ తీవ్ర తనిఖీలు చేట్టింది. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, ప్రధాన బస్టాండ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెట్టారు. మరీ ముఖ్యంగా గతంలో వరుస బాంబు పేళుల్లు జరిగిన కోయంబత్తూరు, తిరునల్వేలి, మదురై వంటి ప్రాంతాల్లో ఈ నిఘా ఎక్కువగా కనిపించింది. అంతేగాక హోటళ్లు, లాడ్జిల్లో అడుగడుగునా సోదాలు చేపట్టిన పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ తనిఖీల్లో పోలీసులతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలు కూడా పాల్గొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజ తనిఖీలు

ఢిల్లీ ఘటనపై స్టాలిన్ దిగ్భ్రాంతి

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై సీఎం స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో అనేకమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఆ దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, వారికి బలం చేకూరాలని కోరుకుంటున్నానని స్టాలిన్ పేర్కొన్నారు.

పోటీ పరీక్షల్లో దివ్యాంగులకు

వెయిటేజీ మార్కులు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పోటీ పరీక్షల్లో దివ్యాంగులకు వారి పని అనుభవం ఆధారంగా వెయిటేజ్ మార్కులు కేటాయించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ వివిధ విభాగాల్లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న దివ్యాంగులకు వెయిటేజ్ మార్కుల జీవోను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఆ ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారి సర్వీస్ ఆధారంగా దివ్యాంగులకు వెయిటేజ్ మార్కులు ఇవ్వనున్నారు. ఈ విధానం రాబోయే మూడు సంవత్సరాల్లో జరిగే ప్రభుత్వ పోటీ పరీక్షలకు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. 2 నుంచి 10 సంవత్సరాల పని అనుభవం ఉన్న వారికి 5 శాతం మార్కులు, 11 నుంచి 15 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి 8 శాతం మార్కులు, 16 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ పని అనుభవం ఉన్న వారికి 10 శాతం వెయిటేజ్ మార్కులు ఇవ్వనున్నారు. అదే సమయంలో, ఉపాధ్యాయ అర్హత పరీక్ష, తమిళ అర్హత పరీక్ష, మొదటి స్థాయి పరీక్షలు వంటి అర్హత పరీక్షలకు ఈ వెయిటేజ్ మార్కులు వర్తించవని ప్రభుత్వం తెలిపింది.


సత్కారం అందుకున్న వృద్ధ దంపతులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

వృద్ధులను సత్కరించడం నా అదృష్టం

● డిప్యూటీ సీఎం ఉదయనిధి ● 70 మంది వృద్ధ దంపతులకు సన్మానం

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ తరహా డీఎంకే పాలనలో హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏడు పదుల వయసున్న వృద్ధ దంపతులను తన చేతుల మీదుగా సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. సోమవారం ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో నగరానికి చెందిన డెబ్బై ఏళ్లు నిండిన 70 మంది వృద్ధదంపతులకు సత్కరించారు. ఈ దంపతులకు రూ.2500 విలువైన ధోవతి, చీర, రవిక, పండ్లు, పసుపుకుంకుమ, గాజులు తదితర వస్తువులు, దేవుడి చిత్రపటం తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఉదయనిధి మాట్లాడుతూ.. రాష్ట్రమంతటా 70 యేళ్ల వయస్సున్న 831 మంది వృద్ధదంపతులకు ఇదే రీతిలో సన్మాన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. తన చేతుల మీదుగా సత్కారాలు అందుకున్నవారిలో 18 వృద్ధ జంటలు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ట్రిప్లికేన్‌కు చెందిన వారు కావటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి తాను ఉప ముఖ్యమంత్రిగా, క్రీడా మంత్రిగా, శాసనసభ్యుడిగా రాలేదని, వృద్ధదంపతుల ఆశీస్సులందుకునేందుకు వారి మనవడిగా వచ్చానని ఉదయనిధి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంతటి భారీ యెత్తున నిర్వహించిన మంత్రి శేఖర్‌బాబుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ వేడుకల్లో మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ, కుండ్రక్కుడి ఆదీనం పొన్నంబళ అడిగళార్, శ్రీపెరుంబుదూరు జీయర్ శ్రీరామానుజ ఎంబార్ స్వామి, సిరవై ఆదీనం కుమారగురుబర స్వామి, మైలం బొమ్మపుర ఆదీనం శివజ్ఞాన బాల్యస్వామి, పేరూరు ఆదీనం శాంతలింగ మరుదాచల అడిగళార్, దేవాదాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార దృష్టి

వైమానిక దళంలో ఉద్యోగాలు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళంలో చేరేందుకు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. భారత వైమానిక దళంలో సాంకేతిక విభాగం, జనరల్ విభాగాల్లో 'ఏ గ్రేడ్' అధికారుల శిక్షణ పొందేందుకు ఇంజనీరింగ్, తత్సమాన అర్హత ఉన్న సైన్స్ పట్టభద్రుల నుంచి దరఖాస్తు స్వీకరణ సోమవారం ప్రారంభమైంది. ఏవియేషన్ విభాగంలో 20 నుంచి 24 ఏళ్లలోపున్న అభ్యర్థులు, గ్రౌండ్ టెక్నాలజీ విభాగానికి 26 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుడు ప్లస్ 2 లో మ్యాథ్స్, ఫిజిక్స్‌తో ఉత్తీర్ణులై, పీజీ పూర్తి చేసి ఉండాలి. అర్హత కలిగిన వారు డిసెంబరు 9వ తేదిలోగా https://afcat.cdac.in/ATCAT/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

కోడిగుడ్లకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పౌష్టికాహార పథకంలో సరఫరా చేసేందుకు ఏడాదికి అవసరమైన 113.38 కోట్ల కోడిగుడ్ల సరఫరాకు టెండర్లు విడుదల చేశారు. కోడిగుడ్ల కొనుగోలుకు ప్రభుత్వం రూ.690 కోట్లు కేటాయించింది. అంగన్వాడీ, పాఠశాలల్లో పనిచేస్తున్న పౌష్టికాహార కేంద్రాల ద్వారా 38,77,438 మంది విద్యార్థులకు గుడ్లు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏడాది పాటు మండలాల వారీగా కోడిగుడ్ల సరఫరాకు అర్హత కలిగిన సంస్థ ఎంపికకు టెండర్లు ఆహ్వానించారు. ఎంపిక చేసిన సంస్థ ఏడాదికి 113 కోట్ల 38 లక్షల 79 వేల 948 కోడిగుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. కోడిగుడ్డు 45 నుంచి 52 గ్రాముల బరువుండాలని టెండర్‌లో పేర్కొన్నారు.

పొంగల్‌కు రైల్వే రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది (2026) పొంగల్ రైల్వే రిజర్వేషన్ ప్రారంభమైంది. పండుగ జరుపుకునేందుకు నగరాల్లో నివసిస్తున్న వారు స్వగ్రామాలకు వెళ్తుంటారు. 2026వ సంవత్సరం పొంగల్ జనవరి 15వ తేది జరుపుకోనున్నారు. ఆ ప్రకారం, జనవరి 9వ తేది ప్రయాణించాలనుకునే వారి రిజర్వేషన్ సోమవారం (ఈ నెల 10వ తేది) ప్రారంభం కాగా, జనవరి 10వ తేది ప్రయాణించాలంటే ఈ నెల 11, జనవరి 12తేదీకి ఈ నెల 13, జనవరి 14న ప్రయాణించాలనుకుంటే ఈ నెల 15వ తేది నుంచి రిజర్వేషన్ చేసుకోవచ్చు. అన్ని రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి రిజర్వేషన్ ప్రారంభం కానుంది. పొంగల్ తరువాత జనవరి 18న తిరుగుప్రయాణం అయ్యే ప్రయాణికులు, ఈ నెల 19వ తేది రిజర్వేషన్ చేసుకోవచ్చు.

30 వరకు పని అనుభవ పత్రాలకు అవకాశం

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో గౌరవ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారు, పని అనుభవ పత్రాలను చెన్నై సాంకేతిక విద్య డైరెక్టరేట్‌లో ఈ నెల 30వ తేది వరకు పొందవచ్చని సాంకేతిక విద్య డైరెక్టరేట్ తెలిపింది. ఈ మేరకు సాంకేతిక విద్య డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, తమ పని అనుభవం సర్టిఫికెట్లు, సాంకేతిక విద్య డైరెక్టరేట్‌ను సంప్రదించి పొందవచ్చని ప్రకటనలో తెలిపింది.

23,24 తేదీల్లో పాఠశాల పాఠ్య ప్రణాళికలో మార్పులపై సమావేశం

- మంత్రి అన్బిల్ మహేష్

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో మార్పులు చేపట్టడంపై ఈ నెల 23,24 తేదీల్లో నగరంలో సమావేశం నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పేర్కొన్నారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ... పాఠ్యాంశాల్లో మార్పులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు కొత్త పాఠ్య ప్రణాళిక రూపొందించడంపై రాష్ట్ర ప్రణాళిక కమిటీ డైరెక్టర్ సుల్తాన్ ఇస్మాయేల్ అధ్యక్షతన రెండు బృందాలు నియమించామన్నారు. ఈ బృందాలతో ఈ నెల 23,24 తేదీల్లో తన అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కొత్త పాఠ్యాంశాల్లో ఆధునిక అంశాలు చోటుచేసుకుంటాయని తెలిపారు.

సెంజి సమీపంలో పురాతన విగ్రహాలు లభ్యం

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా సెంజి సమీపంలోని నంగియానందాల్ గ్రామంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తవ్వకాల్లో, 12వ శతాబ్దం నాటి రెండు విగ్రహాలు లభ్యమయ్యాయి. విల్లుపురానికి చెందిన ప్రొఫెసర్ సౌందర్‌రాజన్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ... తవ్వకాల్లో విష్ణు దుర్గ, నడుక్కల్ విగ్రహాలు బయల్పడ్డాయని, అవి 12వ శతాబ్దానికి చెందినవవన్నారు. 16వ శతాబ్దంలో పరిపాలించిన చోళరాజుల హయాం నుంచి విజయనగర రాజుల హయాం వరకు ఈ గ్రామంలో సిరిసంపదలు తులతూగాయనే విషయం ప్రస్తుతం లభ్యమైన విగ్రహాల ద్వారా స్పష్టమైందని ప్రొఫెసర్ తెలిపారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఏడాది పారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా కళాశాలను సంప్రదించవచ్చు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... 2025-26 విద్యా సంవత్సరానికి అనస్తీషియా టెక్నీషియన్, థియేటర్ టెక్నీషియన్, అత్యవసర విభాగం టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్, ఈసీజీ, ట్రెడ్‌మిల్ టెక్నీషియన్, కార్డియో సోనోగ్రఫీ టెక్నీషియన్ సహా పలు కోర్సులున్నాయి. మద్రాసు మెడికల్ కళాశాలలో 254 సీట్లు, స్టాన్లీ వైద్యకళాశాలలో 393, కీల్పాక్కం వైద్యకళాశాలలో 319, ఓమందూర్ వైద్యకళాశాలలో 48, కలైంజర్ వైద్యకళాశాలో 135 కలిపి వివిధ కోర్సుల్లో 1,149 సీట్లున్నాయి. 2025 డిసెంబరు 31వ తేదితో 17 ఏళ్లు పూర్తయి, ప్లస్ టూలో సైన్స్‌లో 40 శాతం తక్కువ కాకుండా మార్కులు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సుల్లో చేరే విద్యార్థినీ, విద్యార్థులకు 'పుదుమై పెన్', 'తమిళ్‌పుదల్వన్' పథకంలో రూ.1,000 ప్రోత్సాహక వేతనం అందించనున్నారు. చెన్నై జిల్లాకు చెందిన అర్హులైన విద్యార్థులు, తగిన సర్టిఫికెట్లతో ఆయా కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయాన్ని ఈ నెల 14వ తేదిలోపు నేరుగా సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

తిరుచ్చి పోలీసు క్వార్టర్స్‌లో ప్రైవేటు ఉద్యోగి దారుణహత్య



హత్య జరిగిన ప్రాంతంలో డాగ్ స్క్వాడ్ తనిఖీ, హత్యకు గురైన తామరై సెల్వన్

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి పోలీసు క్వార్టర్స్‌లో ప్రైవేటు కంపెనీ ఉద్యోగి దారుణ హత్యకు గురయ్యారు. భీమానగర్ తూర్పు వీధిలో నివసిస్తున్న తామరై సెల్వన్ (27) అనే యువకుడికి యేడాది క్రితం వివాహం జరిగింది. ఆ యువకుడు ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. రోజూ బైకుపై ఆఫీసుకు వెళ్లి సాయంత్రం తిరిగొస్తుంటాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఎప్పటిలాగే తామరై సెల్వన్ బైకులో ఆఫీసుకు బయలుదేరాడు. పాత పోస్టాఫీస్ రహదారిలో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఎదురుగా బైకుపె వచ్చి తామరై సెల్వన్ బైక్‌ను ఢీకొట్టారు. దీంతో బైకు మీది నుంచి తామరై సెల్వన్ రోడ్డుపై పడటంతో ఆ వ్యక్తులు వేట కొడవళ్లు, కత్తులతో అతడిపై దాడి జరిపేందుకు ప్రయత్నించగా, తామరై సెల్వన్ పరుగెత్తుకెళ్లి ధిల్లై నగర్‌లోని పోలీసు క్వార్టర్స్‌లో ఏఎస్ఐ సెల్వరాజ్ ఇంటి లోపల దాక్కునేందుకు వెళ్లాడు. ఆ దుండగులు అతడిని వెంబడిస్తూ ఇంటిలోపలకు చొరబడి తామరై సెల్వన్‌ను ఏఎస్ఐ సెల్వరాజ్, అతడి కుటుంబీకులు చూస్తుండగా వేటకొడవళ్లతో, కత్తులతో నరికి దారుణంగా హతమార్చారు. దీంతో క్వార్టర్స్‌లో నివసిస్తున్న పోలీసులు కుటుంబాలు భయంతో పరుగులు తీశారు. హంతకులు పారిపోతుండగా వారిని పట్టుకునేందుకు పోలీసు కుటుంబీకులు ప్రయత్నించాయి. అయినా ఫలితం లేకపోయింది. విషయం తెలిసిన పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి తామరై సెల్వన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. ఈ హత్య తిరుచ్చిలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ బసచేసిన ప్రాంతానికి సుమారు రెండు కిలోమీటర్లలో జరగటం తీవ్ర కలకలం సృష్టించింది. ఇదిలా ఉండగా సీసీ ఫుటేజీ ఆధారంగా ఈ సంఘటనకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పట్టాలో పేరు మార్చేందుకు రూ.20 వేలు లంచం

- వీఏఓ అరెస్ట్



పట్టుబడిన వీఏఓ ముత్తులక్ష్మి

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టాలో పేరు చేర్చేందుకు రూ.20 వేలు లంచం ఆశించిన వీఏఓ ముత్తులక్ష్మి కటకటాలపాలయ్యారు. తిరుప్పూర్‌లో కరడివాలి ప్రాంతానికి చెందిన రైతు కృష్ణస్వామి, పట్టాలో పేరు చేర్చాలంటూ పల్లడం వడుగపాళయం పుదూర్ వీఏఓ ముత్తులక్ష్మిని సంప్రదించాడు. అందుకు రూ.30వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేయడంతో, తొలివిడతగా కృష్ణస్వామి రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ.20 వేలు ఇంటికి వచ్చి ఇవ్వాలంటూ వీఏఓ ముత్తులక్ష్మి తెలిపింది. లంచం ఇచ్చేందుకు ఇష్టం లేని కృష్ణస్వామి, ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు, ముత్తులక్ష్మి ఇంటికి వెళ్లిన కృష్ణస్వామి, ఆమెకు రూ.20 వేలు అందజేశారు. ఆ సమయంలో అక్కడే మాటువేసిన ఏసీబీ డీఎస్పీ రవించంద్రన్ నేతృత్వంలోని సిబ్బంది లంచం తీసుకుంటున్న ముత్తులక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు.

సెంథిల్ బాలాజీ కేసు వ్యవహారం.. ఈడీకి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు నోటీసు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై నమోదైన కేసుపై నిర్ణయం వచ్చేంత వరకు, చట్టవ్యతిరేక నగదు బదిలీ కేసు విచారణ చేపట్టరాదంటూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 24వ తేదిలోగా అఫిడవిట్ దాఖలుచేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు నోటీసు పంపింది. రవాణా శాఖలో ఉద్యోగాల పేరిట మోసం చేశారనే కేసు చెన్నై ప్రత్యేక కోర్టులో విచారణలో ఉంది. ఈ కేసు ఆధారంగా చట్టవ్యతిరేక నగదు బదిలీ జరిగిందంటూ మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్ కుమార్ తదితరులకు వ్యతిరేకంగా ఈడీ నమోదుచేసిన కేసు కూడా చెన్నై ప్రిన్సిపల్ కోర్టు విచారణలో ఉంది. ఈ కేసులో ప్రస్తుతం సాక్ష్యుల విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సెంథిల్ బాలాజీ సహాయకుడు కార్తికేయన్, గణేశన్ తదితరులు దాఖలుచేసిన పిటిషన్‌లో... ప్రత్యేక కోర్టు నిర్ణయం తీసుకునే వరకు ఈడీ నమోదుచేసిన కేసు విచారణ నిలిపివేయాలని కోరారు. ఈ కేసు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కార్తికేయన్ విచారించగా, కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి సెంథిల్ బాలాజి, గుండె సంబంధిత చికిత్స కోసం అమెరికా వెళ్లిన ఆయన సోదరుడు అశోక్‌కుమార్ సహా 11 మంది హాజరయ్యారు. ఆ సయమంలో విచారణ వాయిదావేయాలని కోరిన కేసులో అఫిడవిట్ దాఖలుకు అవకాశం కల్పించాలని ఈడీ తరఫున విజ్ఞప్తి చేశారు. దానిని పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, అఫిడవిట్ దాఖలుకు అవకాశం కల్పిస్తూ, తదుపరి విచారణ ఈ నెల 24వ తేదీకి వాయిదావేశారు.

ప్రమాదవశాత్తు బాలుడి మృతి: కుమారుడి మరణాన్ని తట్టుకోలేక కుమార్తె సహా తల్లి ఆత్మహత్య



కుమారుడు, కుమార్తెతో జయలక్ష్మి దంపతులు (ఫైల్ ఫొటో)

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుమారుడి మృతి తట్టుకోలేని తల్లి, తన కుమార్తె సహా రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెంగల్పట్టు జిల్లాలో చోటుచేసుకుంది. మధురాంతకం సమీపంలోని ప్రాంతానికి చెందిన సెంథిల్‌కుమార్-జయలక్ష్మి దంపతులకు పురుషోత్తమన్(12) అనే కుమారుడు, పద్మావతి (14) అనే కుమార్తె ఉన్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పురుషోత్తమన్ సమీపంలో చెరువులో స్నానానికి వెళ్లి లోతైన ప్రాంతంలో మునిగి మృతిచెందాడు. కుమారుడి అంత్యక్రియల అనంతరం అస్థికలను సముద్రంలో కలిపేందుకు సెంథిల్ కుమార్ వెళ్లాడు. కుమారుడి మృతి తట్టుకోలేని జయలక్ష్మి, తన కుమార్తెతో కలసి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కొనసాగుతున్న శ్రీలంక నావికాదళం దాడులు

- మైలాడుదురైకు చెందిన 14 జాలర్ల అరెస్ట్

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికా దళం దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా, సరిహద్దులు దాటారని ఆరోపిస్తూ మైలాడుదురైకు చెందిన 14 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేయడంపై జాలర్ల సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. మైలాడుదురై జిల్లా తరగంబాడి షిపింగ్ హార్బర్ నుంచి వానగిరి జాలర్ల గ్రామానికి చెందిన రాయమ్మకు చెందిన మర పడవలో అదే గ్రామానికి చెందిన 14 మంది జాలర్లు ఈ నెల 7వ తేది సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. భారత సరిహద్దు ప్రాంతమైన అనలై దీవి సమీపంలో సోమవారం తెల్లవారుజామున వారు చేపలు పడుతున్న సమయంలో గస్తీ పడవల్లో వచ్చిన శ్రీలంక నావికా దళం వారి పడవను చుట్టుముట్టింది. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారంటూ 14 మంది జాలర్లను అరెస్ట్ చేసి, వారి పడవ స్వాధీనం చేసుకుంది. అనంతరం జాలర్లను కాంగేశం హార్బర్ తరలించి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఈ సమాచారం అందుకున్న జాలర్ల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శ్రీలంక నావికా దళం దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, సముద్రంలో చేపల వేటకు వెళ్తే తిరిగి వస్తామా? రాలేమా? అనే సందేహం నెలకొన్నాయన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మెదడు నిర్జీవం..అవయవాలు సజీవం

- రైతుకూలీ అవయవదానం



జగదీష్ బాబు (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన వ్యవసాయ కార్మికుడి అవయవాల ద్వారా పలువురికి పునరుజ్జీవితం లభించింది.. తిరువారూరు జిల్లా ఎల్లనాకలడి ప్రాంతానికి చెందిన జగదీష్‌బాబు (36) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేది ద్విచక్రవాహనంపై వెళ్తున్న జగదీష్ బాబు అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో గాయపడి తిరుత్తురైపూండి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తలపై తీవ్రగాయం కావడంతో మెరుగైన చికిత్సలకు తిరువారూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ జగదీష్‌బాబు మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనలతో ఆయన అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. వైద్యకళాశాల ఆస్పత్రి ప్రిన్సిపాల్ సుమతి నేతృత్వంలో వైద్య బృందం ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా, జగదీష్‌బాబు అవయవాలను సేకరించారు. ఇప్పటికే అవయవాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ అవయవాలు అందజేయనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. జగదీష్‌బాబు మృతదేహానికి నాగపట్టణం ఎంపీ సెల్వరాజ్, మన్నార్‌కుడి ఆర్డీఓ యోగేశ్వరన్, వైద్యకళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ సుమతి ప్రభుత్వం తరఫున నివాళులర్పించారు.

ముల్లైపెరియార్ డ్యాం పటిష్ఠం

కేంద్ర పర్యవేక్షణ బృందం నివేదిక



డ్యాం దగ్గర కేంద్ర బృందం తనిఖీలు

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముల్లైపెరియార్ డ్యాంను సోమవారం పరిశీలించిన కేంద్ర బృందం డ్యాం పటిష్ఠంగా ఉందని వెల్లడించింది. ముల్లైపెరియార్ డ్యాం సమస్య పరిష్కారానికి జాతీయస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో, కేంద్ర జలవనరుల శాఖ-జాతీయ ఆనకట్ట భద్రతా అథారిటీ ద్వారా 7 మంది సభ్యులతో కమిటీ, ఉప కమిటీలను ఏర్పాటుచేసింది. ఈ బృందాలు నైరుతి, ఈశాన్య రుతుపవనాల సమయంలో ఆనకట్టను తనిఖీ చేసి, దాని నిర్వహణ, భద్రతపై నివేదిక అందజేస్తుంటాయి. కేంద్ర పర్యవేక్షణ బృందం మార్చి 22న ఆనకట్టను పరిశీలించింది. ఈ నేపథ్యంలో, ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చనున్నాయనే వాతావరణ కేంద్రం హెచ్చరికతో, ఈ బృందం సోమవారం ఆనకట్టను తనిఖీ చేసింది.. తొలుత తేక్కడి నుంచి అనీల్ జైన్ నేతృత్వంలోని బృందం, రాష్ట్ర జలవనరుల శాఖకు చెందిన పడవలో ఆనకట్ట వద్దకు వెళ్లి, ప్రధాన ఆనకట్ట, బేబీ ఆనకట్ట, గ్యాలరీ, ఇతర ప్రాంతాల్లో భూప్రకంపనలను ప్రత్యేక పరికరాలతో పరిశీలించారు. అనంతరం నాలుగో గేట్ ఆపరేట్ చేసి తనిఖీ చేశారు. ఆనకట్ట నుంచి నీటి లీకేజీ పరిశీలించారు. ఈ లీకేజీ ఆనకట్ట నీటిమట్టానికి అనుగుణంగా ఉందని నిర్ధారించారు. ప్రస్తుతం డ్యాంలో 134.80 అడుగుల నీటిమట్టం ఉండగా, నిముషానికి 93.6 లీటర్లు లీకవుతుందని, ఇది సరైన స్థాయిలో ఉన్నందున డ్యాం బలంగా ఉందని అధికారులు తెలిపారు.

తేనెటీగల దాడిలో అటవీ సిబ్బందికి గాయాలు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరులో తేనెటీగల దాడిలో ఆరుగురు అటవీ శాఖ సిబ్బందికి గాయాలయ్యాయి. కున్నూర్ ప్రాంతంలో అటవీ శాఖకు చెందిన స్థలంలో సోమవారం ఉదయం అటవీ శాఖ సిబ్బంది శుభ్రం చేస్తున్న సమయంలో, ఓ చెట్టుపై ఉన్న తేనెతెట్టు నుంచి వచ్చిన తేనెటీగలు సిబ్బందిపై దాడిచేశాయి. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. సహచరులు వారిని కున్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అంబత్తూర్ కర్మాగారంలో అగ్నిప్రమాదం

ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూర్ టెలిఫోన్ ఎక్స్చేంజ్ సమీపంలో ఉన్న పాత ఇనుప కర్మాగారంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం రాత్రి సిబ్బంది కర్మాగారంలో పనిచేస్తున్న సమయంలో వేడి చేసిన ఇనుప కమ్మీలను క్రేన్ సాయంతో నీటి బావి వద్దకు తరలిస్తుండగా, నిప్పురవ్వలు ఎగిసిపడి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. సిబ్బంది అందజేసిన సమాచారంతో ఎస్టేట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణ ఆస్తి నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

నేటినుంచి నేర్మై నగర్ శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల కారణంగా నేర్మై నగర్ శ్మశాన వాటికను మంగళవారం నుంచి మూసివేయనున్నారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... తిరువిక నగర్ మండలం 66వ వార్డులోని నేర్మై నగర్ శ్మశానవాటికలో మరమ్మతుల కారణంగా మంగళవారం నుంచి ఈ నెల 25వ తేది వరకు మూసివేస్తున్నామన్నారు. ఈ రోజుల్లో ప్రజలు 67వ వార్డులోని తాంగళ్ శ్మశానవాటిక, 64వ వార్డులోని జీకేఎం శ్మశాన వాటికలను వినియోగించుకోవాలని జీసీసీ తెలిపింది.

34 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబత్తూర్‌లో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. అంబత్తూర్ ఎక్సైజ్ సీఐ రమేష్ నేతృత్వంలో పోలీసులు ఆదివారం రాత్రి అంబత్తూర్ బస్టాండ్‌లో గస్తీ తిరుగుతున్న సమయంలో బ్యాగులతో ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఒక బ్యాగులో 20 కిలోలు, మరో బ్యాగులు 14 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... ఎన్నూర్ థర్మల్ స్టేషన్ కామరాజ్ నగర్‌కు చెందిన విఘ్నేష్ అలియాస్ విక్కీ, ఎర్నావూర్ ప్రాంతానికి చెందిన దయాళన్ అని తెలిసింది. ఆంధ్ర రాష్ట్రం అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి నుంచి 34 కిలోల గంజాయి కొనుగోలు చేసి రైలులో నగరానికి చేరుకున్నారని, అంబత్తూర్ ప్రాంతంలో గంజాయి చిల్లరగా విక్రయించేందుకు యత్నిస్తున్నారని తెలిసింది. ఇద్దరి అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని సహా ఇద్దరి మృతి

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని, విద్యార్థి మృతిచెందారు. తవిట్టుపాళయం ప్రాంతానికి చెందిన సతీష్ (19), కామరాజ్ నగర్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని సౌపర్ణిక (19) సోమవారం కళాశాలకు స్కూటర్‌పై బయల్దేరారు. అందియూర్ సమీపంలో వస్తున్న స్కూటర్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

రెండు విమానాలకు బాంబు బెదిరింపు

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కౌలాలంపూర్, అబుదాబి నుంచి నగరానికి వచ్చిన రెండు విమానాలకు బాంబు బెదిరింపు ప్రయాణికుల్లో కలకలం రేపింది. రెండు విమానాలు స్థానిక విమానాశ్రయంలో ల్యాండింగ్ అయిన వెంటనే బాంబులు పేలుతాయంటూ బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. బాంబ్ స్క్వాడ్ నిపుణులు, పోలీసులు రన్‌వే, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. కాగా, మూడో రోజు కూడా విమానాలకు బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది.

తపాలా సమస్యల పరిష్కార శిబిరాలు

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 11,832 తపాలా కార్యాలయాల్లో వినియోగదారుల సమస్యల పరిష్కార శిబిరాలు నిర్వహించనున్నారు. వినియోగదారులు తమ సమస్యలను ఈ నెల 17వ తేదిలోపు తెలియజేయాలి. ఈ మేరకు తమిళనాడు తపాలా శాఖ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ సేవల్లో ఏవైనా లోపాలు, సమస్యలు ఉన్నట్లయితే, వాటిని 'తపాలా గ్రీవెన్స్' అనే శీర్షికతో, సహాయ డైరెక్టర్, ప్రధాన తపాలా కార్యాలయం, తమిళనాడు సర్కిల్, చెన్నై-700002' అనే చిరునామాకు ఈ నెల 17వ తేదిలోపు పంపించాలని తెలిపింది. అలాగే, వినియోగదారులు DAKADALATpg.tn@indiapost.gov.in అనే ఈ-మెయిల్‌లో సమస్యలు తెలియజేయవచ్చని తపాలా శాఖ తెలిపింది.

పార్టీ సభలకు డిపాజిట్ విధానం తగదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండ్యన్



ప్యారీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ పార్టీలు నిర్వహించే బహిరంగ సభలు, ర్యాలీలకు డిపాజిట్ చెల్లించాలన్న నిబంధన వెనక్కి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండ్యన్ డిమాండ్ చేశారు. కృష్ణగిరి జిల్లా డెంకనికోటలో సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రీయ విప్లవ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సభలో వీరపాండియన్ మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహిస్తే డిపాజిట్ చెల్లించాలన్న విధానం సరికాదని, ప్రజాస్వామ్య దేశంలో సభలు జరుపుకోవడానికి ప్రతి పౌరుడు, పార్టీలకు హక్కు ఉందన్నారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి బలంగా ఉందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తుందన్నారు. ఎన్నికల ముందు పార్టీ సభలకు విధించిన డిపాజిట్ నిబంధన వెనక్కి తీసుకునే అంశాన్ని సీఎం పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోలీసు పరీక్షల్లో మాస్ కాపీయింగ్

- మహిళ సహా ముగ్గురి విచారణ

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో సెల్‌ఫోన్ వినియోగించి మాస్ కాపీయింగ్ పాల్పడిన వ్యవహారంలో మహిళ సహా ముగ్గురిని అధికారులు విచారిస్తున్నారు. రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 3,665 పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 45 పరీక్షా కేంద్రాల్లో 2.23 లక్షల మంది హాజరయ్యారు.. ఈ క్రమంలో తెన్‌కాశి జిల్లా ఇలంజి పరీక్షా కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరిగినట్లు ఫిర్యాదులుందాయి. ఈ కేంద్రంలో పరీక్ష రాసిన గోపాలకృష్ణన్, పాండియరాజ్ సెల్‌ఫోన్‌లో ప్రశ్నాపత్రం ఫొటో తీసి, బయటకు పంపి, తద్వారా సమాధానాలు రాసినట్లు తెలిసింది. ఇందులో ఓ మహిళ సాయం చేసినట్లు విచారణలో తెలిసింది. దీంతో, ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

కార్పొరేటర్ కార్యాలయంపై బాంబు దాడి

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహిళా కార్పొరేటర్ కార్యాలయంపై నాటు బాంబు దాడి కలకలం రేపింది. అశ్విని కరుణ జీసీసీ 196వ వార్డు కార్పొరేటర్‌గా వ్యవహరిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆమె కార్యాలయానికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు నాటుబాంబు విసిరి పరారయ్యారు. బాంబు పేలడంతో కార్యాలయంలోని గోడలు బీటలు వారగా, వస్తువులు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై కన్నగినగర్ పోలీసులు కేసు నమోదుచేసి, ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ ఆధారంగా అగంతకుల కోసం గాలిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులపై లైంగిక వేధింపులు యువకుడికి దేహశుద్ధి

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య కార్మికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని సహచర కార్మికులు దేహశుద్ధి చేశారు. జీసీసీ పరిధిలోని అడయార్ ఫ్లై ఓవర్ సమీపంలో సోమవారం వేకువజామున పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ యువకుడు, అక్కడ పనిచేస్తున్న కార్మికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె వేసిన కేకలతో చుట్టుపక్కల పనిచేస్తున్న కార్మికులు అక్కడకు చేరుకుని, ఆ యువకుడిని చీపుర్లు, కర్రలతో చావబాదారు. వారి నుంచి తప్పించుకున్న యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ వ్యవహారంలో బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన శాస్త్రి నగర్ పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ ఆధారంగా పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

కిడ్నాప్‌కు గురైన బాలిక.. 25 రోజుల అనంతరం లభ్యం

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్‌లో గత నెల 16వ తేది కిడ్నాప్‌కు గురైన ఏడాదిన్నర వయస్సున్న ఆడబిడ్డను నామక్కల్‌లో పోలీసులు రక్షించారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి ఈరోడ్‌కు వచ్చిన వెంకటేష్-కీర్తన దంపతులు సిత్తోడు ఫ్లై ఓవర్ కింద తమ ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. గత నెల 15వ తేది అర్థరాత్రి వందన అనే ఏడాదిన్నర కుమార్తెను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆరు ప్రత్యేక పోలీసులు బృందాలు తీవ్రంగా గాలించాయి. ఈ క్రమంలో, సోమవారం నామక్కల్‌లో ఆడబిడ్డను గుర్తించిన ప్రత్యేక బృందం, బిడ్డను స్వాధీనం చేసుకుని, కిడ్నాప్‌కు కారణమైన పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అన్బుమణి, త్రిష నివాసాలకు బాంబు బెదిరింపు

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) నేత డాక్టర్ అన్బుమణి, ప్రముఖ సినీనటి త్రిష నివాసాల్లో బాంబులు పేలనున్నాయంటూ డీజీపీ కార్యాలయం కంట్రోల్ రూమ్‌కు ఆదివారం అర్థరాత్రి ఈమెయిల్ రావటంతో పోలీసులు అప్పటికప్పుడు ఆ ప్రాంతాలకు వెళ్లి తనిఖీ చేశారు. టి.నగర్ తిలక్ వీధిలో ఉన్న అన్బుమణి నివాసం, ఆళ్వార్‌పేట సెంటాఫ్ రోడ్డులోని నటి త్రిష నివాసంలో బాంబులు అమర్చామని, త్వరలో అవి పేలతాయని వచ్చిన ఈమెయిల్ గమనించి డీజీపీ కార్యాలయం అధికారులు ఆ రెండు ప్రాంతాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. టి.నగర్ పోలీసులు అన్బుమణి నివాసంలో, ఆళ్వార్‌పేట పోలీసులు త్రిష నివాసంలో బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి తనిఖీ చేశారు. చివరకు ఆ బెదిరింపులు ఉత్తుత్తివని నిర్ధారణ అయ్యాయి. ఆ రెండు ప్రాంతాల్లో ఆదివారం వేకువజాము వరకూ పోలీసుల రాకపోకల కారణంగా ఉద్రిక్తత నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తిరుత్తణి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ అడిగి ఎక్కిన లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. తిరువళ్లూర్ జిల్లా కనకమ్మసత్రం పోలిరాజా నగర్ మోట్టూరు గ్రామానికి చెందిన వెంకటేశన్ కుమారుడు గోపి (26) ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా పిచ్చాటూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బయల్దేరిన గోపి, కారు విడిభాగాలు తరలిస్తున్న లారీలో లిఫ్ట్ అడిగి ఎక్కాడు. చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలో ఆర్కాడు కుప్పం సమీపంలో గోపి వస్తున్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలైన గోపి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కనకమ్మసత్రం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, గోపి తల్లిదండ్రులు ఇదివరకే మృతిచెందగా, సోదరికి డిసెంబరులో వివాహం చేసేందుకు గోపి ఏర్పాటుచేస్తున్న సమయంలో ఈ దారుణం జరగడం గ్రామస్తులను విషాదంలో ముంచెత్తింది.

- కోవై అత్యాచారం కేసు..

'టిప్' నిర్వహణకు పోలీసుల పిటిషన్

అడయార్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో యువతిపై సామూహిక అత్యాచారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి 4వ తేది రాత్రి కోవై కుడియలూరు వెళ్లికిరను ప్రాంతంలో ముగ్గురిని గుర్తించిన పోలీసులు, కాల్పులు జరిపి వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన ముగ్గురిని బాధితురాలి ఎదుట హాజరుపరిచి 'టెస్ట్ ఇడెంటిఫికేషన్ పరేడ్' (టిప్) నిర్వహించేందుకు అనుమతి కోరుతూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పీలమేడు పోలీసులు సోమవారం పిటిషన్ దాఖలుచేశారు.

‘కమల్ 237’లో మాలీవుడ్ టెక్నీషియన్లకు ప్రాధాన్యం?

అగ్ర నటుడు కమల్ హాసన్ నటించనున్న 237వ చిత్రంలో మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన టెక్నీషియన్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సినిమా నిర్మాణం కోసం ఎంపిక చేసిన టెక్నీషియన్లలో సంగీత దర్శకుడు, కెమెరామెన్, ఎడిటర్‌తో పాటు పలువురు మాలీవుడ్ సాంకేతిక నిపుణులు ఉండటం గమనార్హం. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించే ఈ చిత్రానికి ప్రముఖ స్టంట్ దర్శక ద్వయం అన్బరివు దర్శకత్వం వహిస్తున్న విషయం తెల్సిందే. ఈ ప్రాజెక్టుపై ఎంతో కాలంగా ఊహాగానాలు వస్తున్నప్పటికీ కమల్ హాసన్ తన పుట్టిన రోజైన ఈ నెల 7న అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ సినిమాకు పనిచేసే సాంకేతిక నిపుణుల వివరాలను కూడా నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఇందులో సంగీత దర్శకుడిగా జేక్స్ బిజాయ్‌ను ఎంపిక చేశారు. ఆయన గతంలో ‘ధృవంగల్ పదినారు’, ‘పోర్ తొళిల్’, ‘నిరంగల్ మూండ్రు’ వంటి పలు తమిళ హిట్ చిత్రాలకు సంగీతం సమకూర్చారు. కెమెరామన్‌గా ‘ఆడు జీవితం’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రానికి పనిచేసిన సునీల్ కేఎస్, ఎడిటర్‌గా షమీర్‌ను సెలెక్ట్ చేశారు. అలాగే, మరి కొందరు మలయాళ టెక్నీషియన్లకు కమల్ తన 237వ చిత్ర నిర్మాణంలో భాగస్వామ్యం కల్పించడం గమనార్హం.


‘కమల్237’ బృందం

చిత్రజ్యోతి

అనారోగ్యంతో
నటుడు అభినయ్ మృతి

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కస్తూరి రాజా డైరెక్షన్‌లో ‘తుల్లువదో ఇలమై’ మూవీ ద్వారా కోలీవుడ్‌కు పరిచయమై ‘సింగార చెన్నై’, ‘జంక్షన్ తదితర చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటుడు అభినయ్(44) సోమవారం మృతి చెందారు. గత కొద్ది నెలలుగా ఆయన తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతూ ఆరోగ్యం బాగా దెబ్బతిని బాగా చిక్కిపోయారు. అభినయ్ చికిత్స కోసం నటులు ధనుష్, బాలా తదితరులు ఆర్థిక సాయం కూడా చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం వేకువజాము నాలుగు గంటలకు కోడంబాక్కం రంగరాజపురంలోని నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. అభినయ్ కుటుంబీకులెవరూ లేకపోవటంతో అంత్యక్రియలు ఎవరు జరపాలన్న విషయమై నటీనటుల మధ్య తర్జన భర్జన జరిగింది. ఈ విషయం తెలుసుకున్న నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చిమురుగన్ అంత్యక్రియలు నిర్వహించేందుకు సంఘానికి చెందిన కొంతమంది సభ్యులతో ఓ బృందాన్ని పంపారు. ఆ బృందం అభినయ్ అంత్యక్రియలు నిర్వహించనుంది.


అభినయ్ (ఫైల్‌ఫొటో)

షూటింగ్ కోసం
హనీమూన్ తేదీ మార్చుకున్న హీరో


కిషన్ దాస్

సినిమా షూటింగ్ కోసం యువ హీరో కిషన్ దాస్ తన హనీమూన్ షెడ్యూల్ మార్చుకున్నారు. ‘ముదలుం నీ ముడివుం నీ’, ‘సింగ్’, ‘తరుణం’ వంటి చిత్రాల్లో హీరోగా నటించిన కిషన్ దాస్... తాజాగా ‘ఆరోమలే’ అనే ప్రేమ కథా చిత్రంలో కథానాయకుడు. ఇందులో శివాత్మిక రాజశేఖర్ హీరోయిన్. హీరో పాఠశాల బాలుడు, కాలేజీ విద్యార్థి, ఉద్యోగానికి వెళ్ళే యువకుడి గెటప్‌ల్లో కనిపించనున్నారు. మేఘా ఆకాష్, నర్మద అతిథి పాత్రల్లో నటించారు. ఇదిలావుంటే, ఈ సినిమా షూటింగ్ సమయంలో కిషన్ దాస్‌కు, సుచిత్ర అనే యువతితో ప్రేమ వివాహం జరిగింది. ఈ పెళ్ళి తర్వాత ఆయన హనీమూన్ కోసం ప్లాన్ చేసుకున్నారు. అయితే, చిత్రీకరణ ముమ్మరంగా సాగుతుండటంతో తన హనీమూన్ వాయిదా వేసుకుని షూటింగ్‌లో పాల్గొన్న విషయాన్ని ఆయన తాజాగా వెల్లడించారు.

నటి హనీ రోజ్ సాహసం!!


‘రేచల్’లో ఓ దృశ్యం

చిత్రపరిశ్రమలో అగ్ర హీరోలు సైతం తమ చిత్రాలను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు వెనుకంజ వేస్తున్న తరుణంలో నటి హనీ రోజ్ మాత్రం పెద్ద సాహసం చేస్తున్నారు. ఆమె నటించిన ‘రేచల్’ను పాన్ ఇండియా లెవల్‌లో విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. డిసెంబరు 6న దక్షిణాది భాషలతో పాటు హిందీలో ఒకేసారి రిలీజ్ చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్ర గురించి ఆమె మాట్లాడుతూ, ‘కొంత విరామం తర్వాత మళ్ళీ కెమెరా ముందుకు వచ్చాను. ‘రేచల్’ ఒక భారీ యాక్షన్ మూవీ. నవీన్ పాలి ప్రధాన పాత్ర పోషించారు. ‘1983’, ‘యాక్షన్ హీరో బైజు’ వంటి పలు చిత్రాలను రూపొందించిన అబ్రిడ్ షైన్ ఈ మూవీకి కథ సమకూర్చడంతో పాటు ఒక నిర్మాతగా వ్యవహరించారు. వచ్చే నెల 6న తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నాం’ అని వెల్లడించారు.







తిరుచ్చిలో వృద్ధుల కోసం నిర్మించిన ‘అన్బు చోలై’ సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్ - అన్బు చోలై ప్రారంభించి క్యారెమ్స్ ఆడుతున్న స్టాలిన్

సీనియర్ సిటిజన్ల కోసం
‘అన్బు చోలై’ సంరక్షణ కేంద్రాలు
తిరుచ్చిలో ప్రారంభించిన సీఎం

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీనియర్ సిటిజన్ల కోసం పది కార్పొరేషన్లు సహా 25 ప్రాంతాల్లో ‘అన్బు చోలై’ పేరుతో సంరక్షణ కేంద్రాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. తిరుచ్చి పొన్‌మలై వద్ద సోమవారం ఉదయం సాంఘిక సంక్షేమం, మహిళా సాధికారిక శాఖల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ కేంద్రాలను సీఎం ప్రారంభించారు. పది కార్పొరేషన్లలో తలా 2 చొప్పున 20 సంరక్షణ కేంద్రాలు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో 3 కేంద్రాలు, రాణిపేట, కృష్ణగిరిలో ఒక్కొక్కటి చొప్పున ఆయన ప్రారంభించారు. రాజధాని నగరం చెన్నైలో తండయార్‌పేట, చోళింగనల్లూరు, విరుగంబాక్కం కేంద్రాలను కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిరుచ్చి నుంచి ప్రారంభించారు. ఈ కేంద్రాలలో వృద్ధులకు ఫిజియోథెరపీ, యోగా, క్యారమ్స్, చెస్ వంటి క్రీడలు వారి మానసోల్లాసానికి తగ్గ సదుపాయాలు ఉంటాయని సీఎం స్టాలిన్‌చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎస్. రఘుపతి, గీతాజీవన్, ఎస్ఎస్ శివశంకర్, అన్బిల్ మహేష్, మెయ్యనాథన్, ఎంపీలు తిరుచ్చి శివా, ఏ. రాజా, దురైవైగో, తిరుచ్చి జిల్లా కలెక్టర్ వి.శరవణన్, మేయర్ ఎం. అన్బళగన్, కార్పొరేషన్ కమిషనర్ ఎల్. మధుబాలన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటీసీకి జాతీయ పురస్కారం

● అభినందించిన సీఎం స్టాలిన్

పార్యీస్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ నగరాల్లో ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రజా రవాణాను కొనసాగిస్తున్న సంస్థలను ఎంపిక చేసి కేంద్ర నగరాభివృద్ధి మంత్రిత్వ శాఖ పురస్కారాలు ప్రదానం చేస్తుంది. అందులో భాగంగా ఈ ఏడాది జాతీయ పురస్కారానికి చెన్నై మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఎంపికైనట్లు కేంద్రం ప్రకటించింది. ఆ మేరకు, ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా, ఎంటీసీకి, మంత్రికి సీఎం స్టాలిన్ అభినందనలు తెలియజేశారు.


కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్

రాష్ట్రంలో మోడల్ జనగణన ప్రారంభం

పార్యీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ సహాయాలు ప్రజలకు సక్రమంగా చేర్చాలన్న లక్ష్యంతో మోడల్ జనగణన ప్రక్రియ ప్రారంభమైంది. 2011లో దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించారు. ఆ తర్వాత 2021లో ఈ పనులు నిర్వహించాల్సి ఉండగా, కొవిడ్ కారణంగా వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, దేశవ్యాప్తంగా 2027 ఫిబ్రవరిలో జనగణన ప్రారంభమవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా జనగణన ట్రయల్ ప్రక్రియ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. సోమవారం నుంచి తిరువళ్లూర్ జిల్లా ఆర్కే పేట, కృష్ణగిరి జిల్లా అంజెట్టి తాలూకా, కాంచీపురం జిల్లా మాంగాడు మున్సిపాలిటీల్లో ఎన్నికల అధికారులు, సిబ్బంది ఈ పనుల్లో పాల్గొంటున్నారు. వారు ఇంటింటికి వెళ్లి ప్రజల వద్ద 34 రకాల ప్రశ్నలు అడిగి వివరాలు సేకరిస్తున్నారు. అలాగే, ఇళ్ల గణన కూడా ఈ నెల 30వ తేది వరకు జరుగనుంది. ఈ పనుల్లో రాష్ట్ర విద్య, రెవెన్యూ, ఆరోగ్య శాఖలు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ముందుగానే శిక్షణా తరగతులు నిర్వహించారు.


మోడల్ జనగణన చేపట్టిన దృశ్యం

మహిళల ఆరోగ్య సంరక్షణపై ‘సింగ్‌హెల్త్’ ప్రత్యేక సదస్సు


సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న మంత్రి మనో తంగరాజ్

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ క్లబ్ చెన్నై తమిళనాడు ఛాప్టర్ ఆధ్వర్యంలో ఆ దేశానికి చెందిన ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థ ‘సింగ్ హెల్త్’ సోమవారం మహిళల ఆరోగ్య సంరక్షణపై తేనాంపేటలోని స్టార్‌హోటల్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించింది. ఈ సదస్సును రాష్ట్ర మంత్రి మనో తంగరాజ్ ప్రారంభించారు. సింగపూరుకు చెందిన వైద్యనిపుణులు ఈ సదస్సులో పాల్గొని మహిళలకు సంబంధించిన రోగాలకు తీసుకోవాల్సిన చికిత్స గురించి వివరించారు. సింగ్‌హెల్త్ సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎడగర్ పాంగ్ తదితరులు పాల్గొన్నారు.

షావుకారుపేటలో అగర్వాల్ ఐ హాస్పిటల్ ప్రారంభం


షావుకారుపేటలో డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రిలోని ఓ విభాగాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి నేత్ర వైద్యంలో పేరొందిన డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ నగరంలోని షావుకారుపేటలో సోమవారం ఉదయం కొత్త హాస్పిటల్ ప్రారంభించింది. ఈ ఆస్పత్రిని షావుకారుపేట సీఐ రత్నవేల్ పాండియన్ ప్రారంభించారు. డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ సౌందరి, అసోసియేట్ చీఫ్ డాక్టర్ స్మితా నరసింహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌందరి మాట్లాడుతూ ఈ ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెలాఖరువరకూ స్థానికులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహిస్తామని, ఈ పరీక్షలు చేసుకోవడానికి 8925500414 అనే నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

పవర్ టేబుల్ సంఘ యజమానుల సమ్మె

● తిరుప్పూర్‌లో స్తంభించిన వస్త్ర ఉత్పత్తి

పార్యీస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బనియన్ పరిశ్రమలకు ప్రసిద్ధిగాంచిన తిరుప్పూర్‌లో పవర్ టేబుల్ యజమానుల సంఘం డిమాండ్ల పరిష్కారం కోసం సోమవారం సమ్మె చేపట్టింది. ఈ సంఘ సభ్యులైన సుమారు 1,600లకు పైగా బనియన్ ఉత్పత్తి సంస్థలు మూతపడడంతో ఉత్పత్తి పూర్తిస్థాయిలో స్తంభించింది. 2022, జూన్ 6వ తేది ఈ సంఘం వేతనం పెంపు, 8 గంటల పని, ఇతర రాయితీలు కల్పించాలని వస్త్రాలు పంపిణీ చేసే కర్మాగారాలతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం, మొదటి సంవత్సరం 17 శాతం, ఆ తర్వాత మూడేళ్లకు తలా ఏడు శాతం చొప్పున కూలి వేతనం పెంచేందుకు ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం, 2025వ సంవత్సరం అందించాల్సిన 7 శాతం పెంచిన కూలి ఇవ్వలేదు. అందువల్ల తిరుప్పూర్ ప్రాంతంలోని బనియన్ కంపెనీలు కార్మికులకు పెంచిన వేతనం ఇవ్వలేదని పవర్ టేబుల్ యజమానుల సంఘం ఆరోపించింది. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు విధుల్లో పాల్గొనబోమని ప్రకటించిన ఈ సంఘం, సోమవారం నుంచి సమ్మెబాట పట్టింది. ఈ సందర్భంగా పవర్ టేబుల్ యజమానుల సంఘ కార్యదర్శి మురుగేశన్ మీడియాతో మాట్లాడుతూ, తిరుప్పూర్ మాత్రమే కాకుండా సేలం, అవినాశి, చెల్లపల్లి ప్రాంతాల్లో తమ సంఘానికి బ్రాంచీలున్నాయని, వీటిలో లక్షలాది మంది పనిచేస్తున్నారని తెలిపారు. తిరుప్పూర్‌లో ఉన్న దక్షిణ భారత బనియన్ ఉత్పత్తిదారుల సంఘం ‘సైమా’ ద్వారా నాలుగేళ్లకు ఒకసారి కొత్త వేతనం పెంపుపై కుదుర్చుకున్న ఒప్పందం అమలు జరుగుతోందని తెలిపారు. ఈ సంవత్సరానికి సంబంధించి వేతనం పెంపు కొన్ని కంపెనీలు ఇవ్వడం లేదన్నారు. ఈ పెంపు సత్వరం అందజేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టినట్లు ఆయన తెలిపారు. సమ్మె కారణంగా పలు కోట్ల విలువైన బనియన్ ఉత్పత్తి, వాణిజ్యం స్తంభించింది.



‘సర్’కు మద్దతుగా పిటిషన్ అన్నాడీఎంకే కపట నాటకం

● సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) జరగాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం కపటనాటకమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. సోమవారం ఉదయం తిరుచ్చిలో శ్రీరంగం ఎమ్మెల్యే ఎం.పళనియాండి కుమారుడి వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 2021లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఓ వైపు రాష్ట్ర పాలన, మరో వైపు పార్టీ నిర్వహణ, ప్రజానీకానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే పథకాల అన్వేషణ, ఓటర్ల జాబితా సవరణ వంటి వాటితో రోజంతా తాను శ్రమిస్తున్నానని, మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ‘సర్’కు వ్యతిరేకంగా జరుగనున్న ఆందోళనలోను పాల్గొంటున్నానని చెప్పారు. రాష్ట్ర ప్రజలందరికీ సర్ అంటే ఏమిటో తెలియదని, ఎన్నికల సిబ్బంది ఇచ్చే దరఖాస్తులను ఎలా పూర్తిచేయాలో కూడా అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. డీఎంకే ఏడు దశాబ్దాలకు పైగా పటిష్టంగా ఉండటానికి పార్టీ శ్రేణులు, నేతలే కారణమని, నిద్రాహారాలు లేకున్నా పార్టీ కోసం పాటుపడే కార్యకర్తలు ఎక్కువమంది ఉన్నారన్నారు. రాష్ట్రంలో అడ్డదారుల్లో అధికారంలోకి రావాలని బీజేపీ జాతీయ నాయకులంతా డీఎంకే నేతలు, ప్రముఖులు, మద్దతుదారులపై ఐటీ, ఈడీ అధికారులను ఉసిగొల్పారని ఆరోపించారు. అయితే ఆ రెండు విభాగాల అధికారులకు భయపడకపోవటంతో ప్రస్తుతం భారీ యెత్తున ఓట్ల చోరీకి పాల్పడి మైనారిటీలు, ఎస్సీ ఎస్టీల ఓట్లు డీఎంకే కూటమికి పడకుండా అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని చెప్పారు. ఇలా అప్రజాస్వామ్యంగా అధికారంలోకి వచ్చేందుకు తహతహలాడుతున్న బీజేపీకి అన్నాడీఎంకే నేత మద్దతు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. తొలుత ‘సర్’పై ఎలాంటి వ్యాఖ్యలు చేయని ఈపీఎస్ ఉన్నట్టుండి సర్‌కు మద్దతుగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం గర్హనీయమన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని ఆ పార్టీ నేతలకు బానిసలుగా మారిన అన్నాడీఎంకే నేతలు ప్రస్తుతం ‘సర్’కు మద్దతుగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి ఢిల్లీ పెద్దలకు సంతోషం కలిగిస్తున్నారని, ఇదంతా రాజకీయ కపట నాటకమని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని స్టాలిన్ ఎద్దేవా చేశారు. డీఎంకే, దాని మిత్రపక్షాల కార్యకర్తలు, జిలా నాయకులు సమష్టిగా సర్ పనుల్లో అక్రమాలు జరుగకుండా నిఘా వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


తిరుచ్చి శ్రీరంగం ఎమ్మెల్యే ఎం.పళనియాండి కుమారుడి వివాహ వేడుకల్లో వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం స్టాలిన్

మధుమేహంపై అవగాహన ర్యాలీకి విశేష స్పందన


ర్యాలీలో అసిస్టెంట్ కమిషనర్ పల్లవన్ తదితరులు

చెన్నై, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్, మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్, హిందూజా ఫౌండేషన్‌తో కలిసి బీసెంట్‌నగర్ సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వైద్యులు, రోగులు, కుటుంబ సభ్యులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర అసిస్టెంట్ కమిషనర్ ఎంఎస్ఎం పల్లవన్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ వి.మోహన్ మాట్లాడుతూ.. ఈ ర్యాలీ ద్వారా టైప్1 డయాబెటిస్‌తో బాధపడుతున్న ప్రతి బిడ్డ, లేదా పెద్దలు ఒంటరిగా లేరని చెప్పాలనుకుంటున్నట్లు తెలిపారు. సరైన సంరక్షణ, విద్య, సమాజ మద్దతుతో, వారు సంపూర్ణ సాధారణ, విజయవంతమైన జీవితం గడపవచ్చన్నారు.

727 పెంపుడు శునకాలకు మైక్రోచిప్


మైక్రో చిప్ అమర్చుతున్న వెటర్నరీ సిబ్బంది

పెరంబూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతులకు టీకా, మైక్రో చిప్ అమర్చే ప్రత్యేక శిబిరాలు ఈ నెల 16,23 తేదీల్లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది. నగరంలో తగిన అనుమతి లేకుండా పెంచుకుంటున్న శునకాల దాడితో పలువురు గాయపడుతున్నారు. ఈ సమస్యను అధికమించేలా, పెంపుడు జంతువుల (శునకం, పిల్లులు సహా ఇతర జంతువులు) యజమానులు, తప్పకుండా లైసెన్స్ పొందాలని, అలా పొందని యజమానులకు రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామని జీసీసీ హెచ్చరించింది. అలాగే, పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు, వాటి వివరాలతో కూడిన మైక్రో చిప్ అమర్చాలని జీసీసీ తెలిపింది. అందులో భాగంగా నగరంలో ఆరు ప్రాంతాల్లో శనివారం (ఈ నెల 9వ తేది) ప్రత్యేక శిబిరాలు నిర్వహించి టీకా, మైక్రో చిప్ అమర్చే పనులు చేపట్టారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో 727 పెంపుడు జంతువుతులకు టీకాలు వేసి, మైక్రో చిప్ అమర్చినట్లు జీసీసీ తెలిపింది. ఈ శిబిరాలు ఈ నెల 16,23 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు, పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.





డీఎంకే పతాకం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చెన్నై వళ్లువర్ కోట్టమ్‌లో జరిగిన ముగింపు సమావేశంలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి - హాజరైన పార్టీ ప్రతినిధులు


తమిళ ‘బిగ్‌బాస్’ కార్యక్రమాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నగర శివారు ప్రాంతంలోని బిగ్‌బాస్ హౌస్ సమీపంలో ధర్నా చేస్తున్న తమిళగ వాళ్వురిమై కట్చి కార్యకర్తలు

ఓఆర్ఐకి చేరిన రెండు తాళపత్ర గ్రంథాలు




ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు తాళపత్రాలను అందజేస్తున్న రాఘవేంద్రరావు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): ఎస్వీయూ ఉద్యోగి రాఘవేంద్రరావు రెండు తాళపత్ర గ్రంథాలను రూపొందించారు. వీటిని ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. గౌతమి సంహిత అనే జైమిని మహర్షి జ్యోతిష్యానికి వేలూరి సుబ్రమణ్యశాస్త్రి రాసిన వ్యాఖ్యను తాళపత్ర గ్రంథ రూపంలో తెచ్చారు. సింగా రాచార్య రాసిన జాతకరాజీయము గ్రంథానికి కొంపెల్ల నరసింహశాస్త్రి చేసిన తెలుగు వ్యాఖ్యానానికి తాళపత్ర గ్రంథ రూపమిచ్చారు. ఈ గ్రంథాన్ని రాఘవేంద్రరావు ఆంగ్లంలోకి అనువదించి ఓఆర్ఐకి అందజేశారు.

కాశీంఖాన్‌కండ్రిగ పాఠశాలకు కేంద్ర నిధులు

తడ, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): తడ మండలంలోని కాశీంఖాన్‌కండ్రిగ ప్రాథమిక పాఠశాలకు కేంద్రం నిధులు కేటాయించింది. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన (పీఎంఏజీవై) పథకం ద్వారా రూ.3 లక్షలు ఆ పాఠశాలకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలో మరుగుదొడ్లు, నీటి వసతి, తలుపులు, కిటికీలు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఎంఈవో మల్లికార్జునరావు పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలలో సుమారు 18మంది విద్యార్థులు ఉన్నారని, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,217

తలనీలాలు సమర్పించినవారు: 25 వేలు





స్పిరిచ్యువల్ స్ట్రీట్ నమూనా డిజైన్స్

ఇస్కాన్ సమీపంలోనే
స్పిరిచ్యువల్ స్ట్రీట్
స్థల పరిశీలన
త్వరలోనే డిజైన్‌కు తుదిరూపు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆధ్యాత్మిక వీధి (స్పిరిచ్యువల్ స్ట్రీట్) ఏర్పాటు దిశగా మరో అడుగు పడింది. అడుగులు పడుతున్నాయి. ఆర్కిటెక్చర్ డిజైన్ సంస్థ 'పీఎక్స్ మేక్స్' ప్రతినిధులు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యకు అధికారులకు దీనిపై మూడు రోజుల కిందట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తొలుత ఇస్కాన్ ఎదురు (కంచిమఠం)గా ఉన్న రోడ్డును స్పిరిచ్యువల్ స్ట్రీట్‌గా డిజైన్ చేసి చూపించారు. అక్కడ నివాసాలకు ఇబ్బంది వస్తుందని భావించి మరో రోడ్డును ఎంపిక చేయాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు అధికారులు సూచించడంతో మున్సిపల్ ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం అనేక రోడ్లను పరిశీలించింది. ఇస్కాన్ రోడ్డులోని కేంద్రీయ విద్యా భవన్ పక్కన మాస్టర్ ప్లాన్ రోడ్డు అన్ని విధాలుగా ఆమోదయోగ్యంగా ఉంటుందని బృందం అభిప్రాయపడింది. అలిపిరి లింక్ బస్టాండుకు ఎదురుగా, ఇస్కాన్ మందిరానికి పక్కనగల రోడ్డులో స్పిరిచ్యువల్ స్ట్రీట్ ఏర్పాటు చేయడం వలన భక్తుల సందర్శనకు అనువుగా ఉంటుందనే అభిప్రాయానికి వచ్చారు. ఆ మేరకు డిజైన్స్ మార్చాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు కమిషనర్ సూచించారు.

వంద షాపులు

ఆధ్యాత్మిక వీధి ప్రారంభంలో ఆర్చిని ఏర్పాటు చేయనున్నారు. భజనలు, వేదమంత్రాలు, నాదస్వర ధ్వనులు, భక్తిపాటలను వినిపించేలా ప్లాన్ రూపొందిస్తున్నారు. తులసి మాలలు మొదలుకుని ధూపదీపాలు, పుస్తకాలు, ఆధ్యాత్మిక కళాఖండాలు అమ్మే షాపులతో పాటు భక్తులకు ప్రసాదాలు, ఆయుర్వేద వస్తువులు, దేవతామూర్తుల చిత్రపటాలు, హస్తకళా వస్తువులు పూజా సామగ్రి.. ఇక్కడ లభిస్తాయి. దాదాపు 100కి పైగా దుకాణాలు ఉండేలా డిజైన్ చేస్తున్నారు.

ప్రమేయం లేని చోరీ కేసుల్లో తన పేరు ప్రస్తావిస్తున్నాడనే హత్య



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రేణిగుంట నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేని చోరీ కేసుల్లో పోలీసులు వద్ద తన పేరు ప్రస్తావిస్తున్నాడనే కోపంతో మనోజ్‌ను హత్య చేశానని హరిప్రసాద్ విచారణలో చెప్పినట్లు అదనపు ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. సోమవారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ వివవరాలు వెల్లడించారు. ఈనెల 2న ఆదివారం మద్యం దుకాణం సమీపంలో జరిగిన హత్య కేసులో వేలిముద్రలఆధారంగా మృతుడిని మనోజ్‌గా గుర్తించామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టామన్నారు. రేణిగుంటలో నివాసం ఉంటున్న మనోజ్, హరిప్రసాద్ కలసి చోరీలు చేసేవారని, ఈ క్రమంలో వారు జైలు శిక్షకు అనుభవించారన్నారు. ఆ తర్వాత హరిప్రసాద్ పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. అయితే కొన్ని చోరీ కేసుల్లో ప్రమేయం లేకున్నా మనోజ్ పోలీసులు వద్ద తన పేరు చెబుతుండడంతో హరిప్రసాద్ పగ పెంచుకున్నాడన్నారు. అలాగే ఇటీవల హరిప్రసాద్ కాళ్లకు గాయమై నడవలేని స్థితికి చేరుకున్నాడన్నారు. దీనిపై హరిప్రసాద్‌సహా అతని భార్యపై మనోజ్ తప్పుడువ్యాఖ్యలు చేశాడన్నారు. దీంతో మరింత పగ పెంచుకున్న హరిప్రసాద్ ఎలాగైనా మనోజ్‌ను అంతమొందించాలనుకున్నాడని చెప్పారు. తన తమ్ముడు, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సుధాకర్, రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన మిత్రుడు శ్యాంసన్‌తో కలిసి పథకం ప్రకారం ప్లాస్టిక్ పట్టలు, తాళ్లు, టేప్ కొనుగోలు చేశారన్నారు. పెయింటింగ్ కాంట్రాక్ట్ కుదిరిందంటూ నవంబర్ 2వ తేదీ ఆదివారం ఉదయం లక్ష్మీనగర్ వద్ద ఉన్న తన ఇంటికి రావాలని మనోజ్‌ను పిలిచాడన్నారు. ఇంట్లోకి వచ్చిన మనోజ్ కాళ్లచేతులు కట్టి నోటికి, ముక్కుకు స్టిక్కర్ అంటించి ఊపిరి ఆడనీయకుండా చంపి వేశారన్నారు. అనంతరం మనోజ్ మృతదేహాన్ని అసంపూర్ణ భవనంలోని సంపులో వేసి వెళ్లిపోయారన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం కట్ట పుట్టాలమ్మ ఆలయం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు విషయాలను వెల్లడించారన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన సీఐలు మంజునాథ్, జయచంద్ర, ఎస్ఐ సుధాకర్, ట్రైనీ ఎస్ఐ ప్రవల్లిక, కానిస్టేబుళ్లకు ఎస్పీ రివార్డులను అందించారు.

సమస్యలుంటే అధికారుల దృష్టికి తెండి

ఆత్మహత్య పేరుతో బెదిరిస్తే మంచి పద్ధతికాదు ● అర్జీదారులకు క్లాస్ తీసుకున్న కలెక్టర్ ● పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురండి. అంతే తప్ప పెట్రోల్‌క్యాన్ తీసుకొచ్చి ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులకు దిగడ మంచిపద్ధతి కాదు' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఇటీవల కొందరు తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెట్రోల్, డీజిల్‌వెంట తీసుకొచ్చి కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు య్నత్నమని బెదిరించడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో సోమవారం కూడా ఓకుటుంబం కలెక్టరేట్ వద్ద హల్‌చల్ చేసింది. తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురానికి చెందిన వీరాస్వామి దంపతులు, అతడి కుమారుడు క్యాన్ నిండా పెట్రోల్ తీసుకువచ్చారు. 'శ్రీకృష్ణాపురంలో మేము 40 ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. బంధువులు వచ్చి మా పేరుతో ఉన్నాయని దౌర్జన్యంగా పొలం దున్నుతున్నారు. దీనిపై మేము కోర్టుకు వెళ్లాం. కోర్టులో కేసు ఉండగా వారు పొలంలోకి వస్తున్నారు' అంటూ తన భార్య అమరావతితో కలిసి వీరాస్వామి నిరసన తెలిపారు. పెట్రోల్ క్యాన్‌తో వీరు రావడాన్ని గుర్తించిన పోలీసులు కలెక్టర్ వద్దకు తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అర్జీదారులను సున్నితంగా మందలించారు. 'మీ సమస్య కోర్టు పరిధిలో ఉంది. అయినా మీరు అర్జీ ఇచ్చినపుడు రెండుమూడుసార్లు రెవెన్యూ అధికారులు వచ్చారు. అయితే మీరు మొండిగా పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడం సరికాదు. ప్రతి ఒక్కరూ ఇలా బెదిరింపులకు దిగితే ఎలా? ఇలాంటి సంస్కృతిని సహించేది లేదు' అంటూ మందలించారు. తిరుచానూరు ఎస్ఐ అరుణ వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపైనే 169 ఉన్నాయి.





అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - కుటుంబ సభ్యులతో వీరాస్వామి

సమస్యకు పరిష్కారం దొరికింది



నేను గతంలో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశా. ఇప్పటి సీఎం చంద్రబాబుకు పాఠాలు ఆనాడు పాఠాలు చెప్పా. ఇటీవల నారావారిపల్లెకు వచ్చినపుడు నా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లా. దీనిపై కలెక్టర్‌ను కలవడానికి వచ్చాను. చాలా చక్కగా పలకరించారు. మరో వారం రోజుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సహాయం అందుతుందని తెలిపారు.

- కృష్ణమూర్తి, బైరాగిపట్టెడ

పింఛను ఇచ్చి ఆదుకోండి



ప్రసూతి సమయంలో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. నడవలేని స్థితికి చేరుకున్నాను. వీల్‌చైర్ ఉంటే తప్ప బయట ప్రపంచాన్ని చూడలేను. మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నా. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- సాలమ్మ, కోటమంగాపురం, కేవీబీపురం మండలం

మూడుచక్రాల స్కూటర్ ఇవ్వండి



వంటమాస్టర్‌గా పనిచేస్తున్న కుటుంబాన్ని పోషించేవాడిని రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాను. దీంతో నడిచే పరిస్థితి లేదు. ప్రభుత్వంపించను ఇస్తోంది. కుటుంబ ఆర్థిక అవసరాలకు సరిపోవడం లేదు. దివ్యాంగులకు ఇచ్చే మూడు చక్రాల స్కూటర్‌ను ప్రభుత్వం అందజేస్తే యధావిధిగా వంట మాస్టర్ పనికి వెళతాను. దీంతో కుటుంబాన్ని పోషించుకుంటా.

- జయశంకర్, మదనంబేడు, సత్యవేడు

‘తోతాపురి’కి మద్దతు ధర చెల్లించండి

● మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుట రైతుల ధర్నా



పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయలకు గుజ్జు పరిశ్రమ యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువ చెల్లిస్తున్నారంటూ రైతులు ఆందోళనకు దిగారు. పాకాల మండలం రామిరెడ్డిగారిఇండ్లు సమీపంలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుజ్జుపరిశ్రమ ఎదుట సోమవారం మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి రైతులు ధర్నా చేపట్టారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కిలోకు రూ.8 చెల్లించకుండా రూ.3.70, రూ.3.90 చొప్పున ఇవ్వడం దారుణమన్నారు. కనీసం కోతకూలీ, రవాణా ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో మద్దతు ధర చెల్లించకుండా ఇప్పుడు కిలోకు రూ.4లోపు చెల్లించడం తగదన్నారు. నన్నూరివారిపల్లె నుంచి గుజ్జు పరిశ్రమవరకు ర్యాలీ నిర్వహించి ఫ్యాక్టరీ మేనేజర్ బాలాజీ నాయుడికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కిలోకు రూ.4 చొప్పున రాయితీ నగదు చెల్లించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆనందనాయుడు, ఉపాధ్యక్షుడు లవకుమార్ రెడ్డి, కోశాధికారి చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులు
పరిష్కరించకుంటే చర్యలు

● అర్జీదారులు మళ్లీ మళ్లీ వస్తే అధికారులను ఉపేక్షించనన్న ఎస్పీ



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుదారుల్లేక బోసిపోతున్న కౌంటర్లు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించకుంటే చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 70 మంది హాజరై తమ బాధలను అధికారుల ఎదుట మొర పెట్టుకున్నారు. వీటిలో దాదాపు 40 శాతం ఫిర్యాదులను ఇక్కడే పరిష్కరించారు. గతంతో పోలిస్తే ఈసారి అర్జీదారుల సంఖ్య తగ్గింది. దీతో అదనపు ఎస్పీలు, సీఐల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు బోసిపోయాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులే మళ్లీ మళ్లీ వచ్చి ఇబ్బంది పడుతుంటే.. సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని ఇటీవల ఎస్పీ హెచ్చరించారు. దీంతో రెండు, మూడు వారాలుగా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు చొరవ చూపడంతో.. అర్జీదారులు తగ్గారని పోలీసు వర్గాలు చెప్పాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, సీఐలు పాల్గొన్నారు.



మురళీమోహన్ అలియాస్ చిన్నబాబు.. శ్రీపతిబాబు .. ఎస్వీఎం శ్రీధర్.. పెరుమాళ్ మధు.. తోట వాసు.. బీడీ బాలాజీ

6 కార్పొరేషన్లకు 12 మంది డైరెక్టర్లు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 10 కార్పొరేషన్లకు సంబంధించి బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వీటిలో తిరుపతి జిల్లాకు సంబంధించి వివిధ కార్పొరేషన్లకుగాను 12మంది కూటమి నాయకులకు అవకాశం కల్పించింది. వీరిలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా మురళీమోహన్ అలియాస్ చినబాబు (చంద్రగిరి-టీడీపీ), లేబర్ వెల్ఫేర్ బోర్డు డెరెక్టర్‌గా ఆర్.మహేశ్వరి (చంద్రగిరి-టీడీపీ), కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా టీడీ వరప్రసాద్ (తిరుపతి-బీజేపీ), తోట వాసుదేవ (తిరుపతి-టీడీపీ), ఎస్సీ కమిషన్ సభ్యుడిగా శ్రీపతి బాబు (సూళ్లూరుపేట-టీడీపీ), దాసరి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కోల లోకయ్య (సత్యవేడు-టీడీపీ), ప్రేమ్ కుమార్ (తిరుపతి-బీజేపీ), మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎస్వీఎం శ్రీధర్ (తిరుపతి-టీడీపీ), పెరుమాళ్ మధు (తిరుపతి-టీడీపీ), బి.డి బాలాజీ (సత్యవేడు-బీజేపీ), కె.నమశివాయం (సత్యవేడు-టీడీపీ), ఎస్.శరవణ (చంద్రగిరి- టీడీపీ) ఉన్నారు.



ఎన్.ఎన్.ధనపాల్ .. ఎస్.శరవణ.. ఎన్.భాస్కరన్.. కే.నమశ్శివాయం.. కోలా లోకయ్య.. టి.డి.వరప్రసాద్

పేద కుటుంబాలను దత్తత తీసుకుంటా



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ఎన్నారై సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతంలో తన స్నేహితుడు మహ్మద్ ఆరీఫ్ కడపలో ఓ బంగారు కుటుంబానికి మార్గదర్శిగా మారారని, ఈ విషయం తెలిసి తానూ దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. ఈయన నిర్ణయాన్ని కలెక్టర్ అభినందించారు.

మానసిక రోగులకోసం ‘మనోబంధు’

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక రోగులను ఆదుకునేలా ప్రభుత్వం 'మనోబంధు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. రోడ్లపై తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి కడపలో పునరావాస కేంద్రానికి తరలించి చికిత్సలు అందించి తిరిగి వారిని సమాజంలోకి చేర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రతీత్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

జిల్లాలో కుష్ఠువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు లెప్రసీ క్రాస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ద్వారా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు లక్షణాలున్న వారిని గుర్తిస్తారు. వైద్య చికిత్స అందిస్తారు. దీనికి సంబంధించి పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు లక్షణాలను గుర్తిస్తే నివారించవచ్చని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ, డీఐవో శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

నిమోనియా నివారణకు అవగాహన అవసరం

నిమోనియా నివారణకు సామాజిక అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సోషల్ అండ్ యాక్షన్ న్యూట్రలైజ్ నిమోనియా సక్సెస్‌ఫులీ(ఎస్ఏఎన్ఎస్) బ్యానర్లు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఎస్ఏఎన్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు

ధర్మకర్తలమండలి సమావేశంలో పలు అంశాలపై చర్చ

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను గతం కన్నా మరింత వైభవోపేతంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. ఇటీవల ఆలయ నూతన ధర్మకర్తలమండలి కొలువుదీరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం జరిగిన తొలి మండలి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు జాతీయస్థాయిలో కీలక నేతలు, అధికారులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తామన్నారు. మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి, ఆలయం నుంచి లోబావి వరకు రోడ్డు, ఇక భక్తులకు నగదు రహిత ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై కసరత్తు చేశామన్నారు. ఇక ముక్కంటి ఆలయ పారిశుధ్య నిర్వహణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆలయంలో సెంట్రల్ ఏసీ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు పాలు పంపిణీ చేయడం, భక్తులకు స్వామివారి సన్నిధిలో విబూధి, అమ్మవారిసన్నిధిలో కుంకుమను ప్రసాదంగా ఇచ్చే అంశంపై దాతలతో చర్చిస్తామన్నారు. అనంతరం చైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ... తొలి ధర్మకర్తలమండలి సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ మంచి సూచనలు చేశారన్నారు. అలాగే ఈవోతో మండలి సమన్వయం చేసుకుని సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా అభివృద్ధిపథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, సభ్యులు వాకిచర్ల గురప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.

